26న కుప్పంకు సిఎం రాక

శాంతిపురంలో బహిరంగ సభ ఏర్పాట్లపై అధికారులతో సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 26వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలో జరుగునున్న బహిరంగ సభలో పాల్గొనున్నారని, ఈ పర్యటనను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో ఈనెల 26న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, శాంతిపురం మండలం పర్యటనకి సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించి ఎటువంటి చిన్నచిన్న పొరపాట్లకు తావు లేకుండా పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి శాఖల వారీగా కేటాయించిన విధులు నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి ఎన్.రాజశేఖర్, జెడ్పి సిఈఓ ప్రభాకరరెడ్డి, డిఆర్డిఎ, హౌసింగ్, మెప్మా పిడిలు తులసి, పద్మనాభం, రాధమ్మ, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ప్రభావతీ దేవి, డీఈఓ దేవరాజులు, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్‌బి ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి, విజయ్‌కుమార్, ఉమా మహేశ్వరరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ శివయ్య, సమగ్రశిక్ష ఎపిసి వెంకటరమణరెడ్డి, సాంఘిక, బిసి సంక్షేమశాఖల అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బాని బాష, డిపిఓ లక్ష్మి, సీపీఓ సాంబశివ రెడ్డి, ట్రాన్స్కో ఈఈ శ్రీహరి, జిల్లా ఐసిడిఎస్ అధికారి నాగశైలజ, డిఎల్‌డిఓ రవికుమార్, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్లు, డిఎస్పీ సుధాకర్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం బహిరంగ సభ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

బర్డ్ ఫ్లూ కలకలం

అప్రమత్తమైన పశుసంవర్ధకశాఖ అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ సోకిందనే ఉదంతాలతో పశుసంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తం అవుతున్నారు. విజయవాడలో పెద్దసంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయి. కృష్ణ, గోదావరి, నెల్లూరు అనంతపురం జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు అధికారులు. కోళ్ల మృతికి బర్డ్‌ఫ్లూ కారణమని నిర్ధారణతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. నెల్లూరు జిల్లాలో ఇటీవల బర్డ్‌ఫ్లూ వ్యాధి కోళ్ళలో నిర్ధారణ అయినందు వలన జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు.

జిల్లా పశుసంవర్ధకశాఖ గణంకాల ప్రకారం జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమల్లో 9.35 లక్షల కోళ్లు ఉన్నాయి. అలాగే 6.5లక్షల పెరటి కోళ్లు ఉన్నాయి. సంవత్సరానికి 37,089 మెట్రిక్ టన్నుల కోడి మాంసం, 10,723లక్షల కోడి గుడ్లు ఉత్పత్తి అవుతోంది. జిల్లా బర్డ్‌ఫ్లూ సోకకుండా అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది.

అంతేకాకుండా జిల్లాలో పశుసంవర్ధశాఖ వైద్యులు, సిబ్బందని అప్రమత్తం చేయడంతో పాటు జిల్లాలోని కోళ్ల పరిశ్రమ యజమానులు అప్రమత్తం చేశారు.

బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకేది ఇలా....

బర్డ్‌ఫ్లూ వ్యాధి ముఖ్యంగా విదేశీ వలస పక్షుల ద్వారా ఒక ప్రాంతం నుండీ మరో ప్రాంతానికి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి కోళ్లకే కాకుండా ఇతర పక్షులైన గినికోళ్లు, టర్కి కోళ్లు, బాతులు, కొంగలు, నీటి పక్షులకు కూడా వ్యాపిస్తుంది. వ్యాధిసోకిన కోళ్లలో దగ్గు, జలుపు, ఆయాసం, తుమ్ములు వంటి లక్షణాలు ఉంటాయి. దాణా సరిగా తినక రెట్టలు పలుచగా వేస్తాయి. గుడ్ల ఉత్పత్తి గణీయంగా పడిపోవడం, మరణాలశాతం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. కోడి గుడ్డను, కోడి మాంసం బాగా ఉడికించి తినడం వల్ల వ్యాధి మనుషులకు సోకకుండా కాపాడుకోవచ్చు.

కోళ్ళు, దాణా దిగుమతి నిషేధం..

కోళ్ళలో బర్డ్‌ఫ్లూ వ్యాధికి చికిత్స లేదు. టీకాలు లేవు, నివారణనే మార్గం. అందులో భాగంగా నెల్లూరు జిల్లా నుండీ ఎటువంటి కోళ్ళు, కోళ్ళకు సంబంధించిన ఉత్పత్తులు, వాటి దాణా దిగుమతి చేసుకోవడాన్ని జిల్లాలో అధికారులు నిషేధించారు. కోళ్ళ యజమానులు జీవరక్షణ (బయో సెక్యూరిటి) విధానాల గురించి అవగాహన కల్పించడం, అకస్మాత్తుగా ఎక్కువ సంఖ్యలో కోళ్ళులో మరణాలు సంభవించిన ఎడల సమీప పశువైద్యులకు సమాచారం అందించాలని సూచొచారు.

బర్డ్‌ఫ్లూ పై అప్రమత్తంగా ఉన్నాం

- డాక్టర్ ప్రభాకర్, పశుసంవర్ధశాఖ జిల్లా అధికారి

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉన్నాం. జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధశాఖ వైద్య సిబ్బందని అలర్ట్ చేయడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న కోళ్ళ పరిశ్రమ నిర్వహకులను బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపిస్తే పదికి మించి కోళ్ళు చనిపోతే వెంటనే సమీపంలోని పశు వైద్యులను సమాచారం ఇవ్వాలని సూచించాం. చిత్తూరు జిల్లాలో ప్రస్తుతానికి బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించడం లేదు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొందుకు పశుసంవర్ధకశాఖ సిద్ధంగా ఉన్నాం. 31 మండలాల్లో రాఫిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేశాం. పిపిఇ కిట్లు, క్రిమిసంహార మందులు జిల్లాలోని అన్ని పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాము.

నేడు కలెక్టరేట్ ఎదుట ఏపీ జేఏసీ ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ నేతృత్వంలో 20వ తేదీ మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఏపీజేఏసీ జిల్లా అధ్యక్షులు రాఘువులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక బకాయిలు చెల్లించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ఏపీజేఏసీ నేతృత్వంలో పోరాటం చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోవడాన్ని ఏపీ జేఏసీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విజయకుమార్ పాల్గొంటారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్పందనకు 182 అర్జీలు

కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్ఓ పుల్లయ్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిఆర్ఓ బి.పుల్లయ్య పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో స్పందన హాల్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో జిల్లా డిఆర్ఓ బి.పుల్లయ్య, నీటి యాజమాన్యసంస్థ, పథక సంచాలకులు ఎన్.రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డిలతో కలసి జిల్లాలోని నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 182 అర్జీలు అందగా వాటిలో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 157, సీఈఓ జెడ్పీ1, విద్యాశాఖ1, పోలీసు శాఖ 2, జిల్లా పంచాయతీ 1, డిఆర్‌డిఏ 2, సివిల్ సప్లై 2, స్కిల్ డెవలప్‌మెంట్ 1, సర్వే ల్యాండ్ రికార్డ్స్1, ఇండస్ట్రీస్ 1, సోషల్ వెల్ఫర్ 1, ఎస్ఈ పంచాయతీ రాజ్ 1, హౌసింగ్ శాఖ1, ఇతరులు 10 ఉన్నాయి. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద తరచూ సమీక్షిస్తున్నారని, వివిధ శాఖల అధికారులకు వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలు తీసుకుని పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

స్పందనకు మూడు వినతులు

స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషన్ గోవర్ధన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మూడు వినతులు అందినట్లు సహాయ కమిషనర్ గోవర్ధన్ తెలిపారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం 1, ప్రజారోగ్య విభాగం 2 చొప్పున మొత్తం మూడు వినతులు అందాయని, వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి

అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ అడ్మిన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా ఎస్పీ పి.జాషువ ఆదేశానుసారం స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా అడిషనల్ ఎస్పీ ఆదేశించారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 19 ఫిర్యాదులను స్వీకరించిన అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్.ఆరిఫుల్లా ప్రజల నుండి 19 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ అడిషనల్ ఎస్పీ బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మొత్తం 19 ఫిర్యాదులు అందాయి. కుటుంబ తగాదాలు 3, వేధింపుల 2, ఇంటి తగాదాలు 1, భూ తగాదాలు 9, డబ్బు తగాదాలు 2, దారి తగాదాలు 2 ఉన్నాయి.

జర్నలిస్టుపై దాడి సిగ్గుచేటు

కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల ధర్నా
రాజకీయ పార్టీనేతల మద్దతు

చిత్తూరు కలెక్టరేట్ ఎదుట

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఆదివారం అనంతపురం జిల్లా రాపాడులో నిర్వహించిన సిద్ధం సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి సాక్షిగా ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టు కృష్ణపై జరిగిన దాడిని నిరశిస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట చిత్తూరు ప్రెస్‌క్లబ్ నేతృత్వంలో జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. అనంతరం దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ పార్టీల నేతలు ప్రతికాస్వేచ్ఛను కాపాడలంటూ ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట తెలుగుదేశం పార్టీ నేతలు జర్నలిస్టులకు మద్దతుగా ధర్నా చేశారు. పత్రికాస్వేచ్ఛను కాపాడాలని, ఫోటో జర్నలిస్టులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని రాజకీయ పార్టీల నేతలు, జర్నలిస్టు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంఘం నాయకులు అశోక్ కుమార్, మహేష్‌బాబు, ఫింట్‌మీడియా, ఎలక్ట్రానింగ్ మీడియా ప్రతినిధులు బాలసుబ్రమణ్యం, రమేష్, నవిన్, కరీమ్, సురేంద్రరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు. జర్నలిస్టుల పోరాటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ నాయకులు గోపినాథ్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్, తెలుగుదేశం నాయకులు దొరబాబు, చంద్రప్రకాష్, మాజీమేయర్ కఠారి హేమలత, సురేంద్రకుమార్ సంఘీభావం తెలిపారు.

జర్నలిస్టుపై దాడి సిగ్గుచేటు
సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

చిత్తూరులో రాజకీయ నాయకుల మద్దతు

రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై జరిగిన దాడి సిగ్గుచేటని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సోమవారం చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. సభకు సంబంధించిన దృశ్యాలను చిత్రీకరిస్తున్న ఫోటోగ్రాఫర్‌పై విచక్షణ రహితంగా దాడి చేసి కొట్టడం అన్యాయం అన్నారు. దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా కఠినచర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవారు ఎలాంటి వారైనా ప్రజాకోర్టులో నిలబడాల్సిందేనని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాపాడి పత్రికాస్వేచ్ఛకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం
మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు: వచ్చే ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచేయడానికి జనం కసితో సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో వైసిపి ఆధ్వర్యంలో జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై జరిగిన దాడిపై ఆయన స్పందించారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ కవరేజీకి వచ్చిన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసిపి నేతలు చేసిన దాడి దారుణమని, ఇది జర్నలిజంపై జరిగిన దాడి మాత్రమే కాదని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఆయన అభివర్ణించారు. జగన్ తన బూటకపు ప్రసంగాలతో జనాన్ని బురిడీ కొట్టించాలని చూస్తున్నారన్నారు. ఎవరిది అభివృద్ధి పాలనో.. ఎవరిది విధ్వంస పాలనో ప్రజలకు తెలుసున్నారు. జగన్ నోటి నుంచి వచ్చేవి అన్నీ అసత్యాలు, బూటకపు ప్రసంగాలు, తప్పుడు ప్రచారాలే అన్నారు.

గంగాధరనెల్లూరు: రాప్తాడులో సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని ఖండిస్తూ గంగాధరనెల్లూరు నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ గంగాధర నెల్లూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కామసాని గోవర్ధన్‌రెడ్డి మద్దతు పలికారు. విలేకరులు కల్వకుంట రమేష్, రవి, రోహిత్ కుమార్, విజయ్, వెంకటేష్, దేవరాజులు, సుధాకర్, జయచంద్ర నాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, చంద్రబాబు నాయుడు, నీరజాక్షులు, తిరుమల, ఎంజీఆర్, జయ ప్రకాష్, సతీష్ పాల్గొన్నారు.

జిడినెల్లూరులో..

కార్వేటినగరం, వెదురుకుప్పం : ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ జర్నలిస్ట్ కృష్ణపై రాప్తాడులో జరిగిన దాడి పట్ల జర్నలిస్టు ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం కార్వేటినగరంలోని గాండ్ల మిట్ట కూడలి వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఎఎస్సై మునికృష్ణ వినతిపత్రం అందజేశారు. ఎపియుడబ్ల్యూజె నాయకులు గోవిందస్వామి మాట్లాడుతూ పాలకులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు జర్నలిస్టులపై దాడులను ప్రోత్సహించడం మంచి పరిణామం కాదని అన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: వైయస్సార్సీపీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సిద్ధం బహిరంగ సభలపేరుతో మీడియాపై దాడులు చేయించడం దురదృష్టకర సంఘటనని సీనియర్ జర్నలిస్ట్ తూపల్లి జనార్ధన్ అన్నారు. ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణ పై జరిగిన భౌతిక దాడి తీవ్రంగా ఖండిస్తూ పుంగనూరు జర్నలిస్టులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మూలస్తంభమైన మీడియాపై దాడి చేయడం నీచమైనచర్యగా అభివర్ణించారు. సిద్ధమంటే మీడియాపై దాడి దౌర్జన్యం భయానిక పరీక్షలు కల్పించడానికి సిద్ధమా అన్నారు. గోకుల్ సర్కిల్ నుండి ర్యాలీగా అంబేద్కర్ సర్కిల్ చేరుకుని విగ్రహానికి పులమాల వేసి నిరసన తెలిపి, తహశీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేశారు. సీనియర్ జర్నలిస్టులు మురళి, ఉదయ్‌కుమార్, గిరిశేఖర్, వాలేశ్వర్ రెడ్డి, ఏల్కూరు మురళి, అప్పి రెడ్డి పాల్గొన్నారు.

నగరి: పట్టణ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ పై దాడికి నిరసనగా విలేకరులు నిరసన తెలిపారు. అక్కడి నుంచి విలేకరులు ర్యాలీగా నగరి ఆర్డీఓ కార్యాలయం వరకు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఓకు వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులు శ్రీనివాసులు నాయుడు, మనీ, వీటీ భాస్కర్, విజయ్, మోహన్, లోకేష్, అభి, తులసీరామ్ పాల్గొన్నారు. మీడియా ప్రతినిధులపై దాడి అన్యాయమని నగరి తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్తలు రామానుజం చలపతి అన్నారు. రాప్తాడు సీఎం సిద్ధం సభలో విధి నిర్వహణలో వున్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణపై దాడిని ఖండిస్తూ సోమవారం నగరి మునిసిపాలిటి ఒకటో వార్డు టిడిపి మాజీ కౌన్సిలర్ లత, తెలుగు మహిళలు నల్ల దుస్తులు, ముఖానికి నల్ల ముసుగులు, కళ్ళకు నల్ల గంతలు ధరించి నిరసన తెలిపారు.

నగరిలో..

పలమనేరు: ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ పై జరిగిన దాడి సిగ్గుచేటని దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సోమవారం చిత్తూరు జిల్లా పలమనేరు ఆర్‌డిఓకు పలమనేరు మీడియా సభ్యులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు.

పలమనేరులో..

పెద్దపంజాణి: ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ పై జరిగిన దాడి సిగ్గుచేటని దాడి చేసిన వారి పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పెద్దపంజాణి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రెడ్డిప్రసాద్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు ఈ ఘటనకు బాధ్యులైన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు ప్రకాష్ కుమార్, గౌరవ అధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, మాధవ, ధనంజయ, శ్రీనివాసులు, అఫ్జల్ పాల్గొన్నారు.



పెద్దపంజాణిలో..

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి : సిఐటియు

నాలుగో రోజుకు కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - క్యాంపస్

దేశంలోని అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ ప్రాంతీయ పరిశోధన కేంద్రం, వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.జయచంద్ర డిమాండ్ చేశారు. ప్రధాన ద్వారం వద్ద కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారానికి నాలుగో రోజుకు చేరింది. జయచంద్ర మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, నాయకులు సుబ్బు, రేవతి, చంద్రమ్మ అనురాధ, మునిలక్ష్మి, రమా, మురళి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల

ఆన్‌లైన్ దరఖాస్తు గడుపు వారం పెంపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు వివిధ కారణాలతో ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులకు మరో అవకాశం కల్పించింది. సోమవారం నుండి 26 ఫిబ్రవరి వరకు గడుపు పెంచారు. వివిధ కారణాలతో ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మరో వారం రోజుల గడువు కేటాయిస్తున్నట్లు సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి (19 ఫిబ్రవరి, 2024) నుండి 26 ఫిబ్రవరి, 2024 (సోమవారం) వరకు అర్హులైన జర్నలిస్టుల నుండి వెబ్‌సైట్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే 6 జనవరి, 2024 వరకు అంటే నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోని వారికి, నమోదు చేసుకున్నప్పటికీ సబ్మిట్ కొట్టని వారికి ఆయా జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ అక్రిడిటేషన్ కార్డు కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీమ్ కింద ఇంటి స్థలాలను అందించేందుకు ఇప్పటికే ప్రభుత్వం జీవో నంబర్ 535ను జారీ చేసిందని గుర్తుచేశారు. సంబంధిత జీవోలో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయి ఉంటే వారంతా ప్రభుత్వం జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 26 ఫిబ్రవరి, 2024 వరకు నిర్ణీత గడువులోగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం అందించే ఇళ్ల స్థలాలను ప్రతి ఒక్క జర్నలిస్టు పొందాలని తెలిపారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకునే జర్నలిస్టుల దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

ఫ్యాన్ విరిచేందుకు ప్రజలు సిద్ధం: మాజీ ఎమ్మెల్సీ

సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వైసీపీ ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. సోమవారం చిత్తూరు టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లుగా సీఎం వైఎస్ జగన్ గత ఎన్నికల హామీలు నెరవేర్చకుండా పన్నులు, చార్జీలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేశాడని మండిపడ్డారు. ప్రధాన నీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో విఫలమైయ్యారిని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసీపీని ఓడించి కుర్చీ మడత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్రకుమార్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో వైసీపీ పూర్తిగా విఫలమైందన్నారు. ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ మాట్లాడుతూ కూల్చివేతలు, అక్రమాలు, అరాచకాలతో జగన్ తన పాలనను ప్రారంభించారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీ బుద్ధిచెబుతారని తెలిపారు. సమావేశంలో నాయకులు ప్రభుతేజ, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కలలు కన్న స్వరాజ్యం సాకారం: ఎమ్మెల్యే

సచివాలయ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

ప్రజాశక్తి-గంగవరం: గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారమవుతోందని, ఆ లక్ష్యం దిశగా రాష్ట్రంలో అభివృద్ధి ఫలాలు గ్రామాలకు చేరుతున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. సోమవారం మండలంలోని కీలపల్లి సచివాలయ భవనాన్ని, పొన్నమాకులపల్లిలో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 500రకాల సేవలతో ప్రభుత్వ పాలనను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. అదేవిధంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించామని ఆయన స్పష్టం చేశారు.

లక్ష మెజారిటీతో బాబును గెలిపించుకుంటాం: ఎమ్మెల్సీ

పార్టీలో చేరుతున్న పలువురు మైనారిటీ నాయకులు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం నియోజకవర్గంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించుకుంటామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. సోమవారం పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. మండలంలోని వేపూరు మిట్టపల్లికి చెందిన మైనారిటీ నాయకులు మండల కన్వీనర్ ప్రేమ్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేశారు. వీరికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ సమన్వయకర్త పి.ఎస్ మునిరత్నంలు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కష్టించి పని చేసే వారికి టీడీపీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, మంజునాథ్, చలపతి, హైదర్‌వల్లి, ఇమ్రాన్, షబీర్, కనకరాజు, దండపాణి పాల్గొన్నారు.

నేడు గుడిపల్లికి నారా భువనేశ్వరి

ప్రజాశక్తి-గుడిపల్లి, కుప్పం: నారా భువనేశ్వరీ మంగళవారం గుడిపల్లి మండలానికి రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ టి.ఎం బాబునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. మండలంలోని యామగానిపల్లికి చెందిన టీడీపీ నాయకులు కొండప్ప చంద్రబాబు అరెస్ట్ అయిన సందర్భంలో మృతి చెందారు. దీంతో భువనేశ్వరీ మంగళవారం గుడిపల్లికి చేరుకొని కొండప్ప కుటుంబాన్ని పరామర్శిస్తారని పేర్కొన్నారు.

వలంటీర్లుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-సదుం: మండలంలో పని చేస్తున్న గ్రామ వలంటీర్లను సోమవారం సదుం ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. సేవా మిత్రులు 173మందికి, సేవా రత్నాలు 5మందికి, సేవ వజ్రం ఒకరికి చొప్పున పురస్కారాలు అందగా వారిని ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డప్పరెడ్డి, ధనంజయరెడ్డి, ఎంపీడీవో వరప్రసాద్, సర్పంచ్‌లు శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-రామకుప్పం: సమాజంలో ఎయిడ్స్ ప్రాణాంతకం కాదని జిల్లా కోర్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సుమలత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాజుపేట, రామకుప్పంలో ఎయిడ్స్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎయిడ్స్‌పై పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హసీనా, అశ్వతమ్మ, శంషాద్, నాగరాజు, మల్లికార్జున, మునిరత్నం, దొరస్వామి, గీత పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు గ్రామంలో సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను ఈవోఆర్డీ లక్ష్మీదేవి సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రానున్న వేసవిలో ప్రజలకు త్రాగునీటికి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా రోగాలు వ్యాపించకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రత వాతావరణంలో కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కార్యదర్శి జయశంకర్‌ను ఆదేశించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు జాఫర్ తెలిపారు. స్థానిక సర్పంచ్ అఖిల, జాఫర్ ఆధ్వర్యంలో రమా నేత్రాలయ కంటి ఆసుపత్రి వారిచే ఆదివారం శిబిరం నిర్వహించగా 152మంది పరీక్షలు చేయించుకున్నారు.

ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా జయకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-సదుం: సదుం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా జయకుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఆయన తిరుపతి జిల్లా పాపానాయుడుపేటలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో ఇదే పాఠశాలలో ఆయన గణిత ఉపాధ్యాయులుగా పనిచేశారు. పలువురు ఆయనకు శుభాభినందనలు తెలిపారు.

వ్యవసాయాభివృద్ధికి టీడీపీ కృషి

ప్రజాశక్తి-రామకుప్పం: వ్యవసాయం అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రైతు కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు చలపతి, మండల కన్వీనర్ బాబు, మాజీ ఎంపీపీ అంజనేయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రైతు చైతన్య యాత్ర నిర్వహించారు. వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో రైతులకు సబ్సిడీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్, పట్టుపురుగుల పెంపకం, పాల ఉత్పత్తి, ఇజ్రాయిల్ తరహాలో వ్యవసాయం తదితర వాటిని ప్రోత్సహించి రైతులకు ఆర్థిక అభివృద్ధి చేసిన ఘనత టిడిపికి దక్కుతుందన్నారు. హంద్రీనీవా కాలువను 87శాతం టిడిపి ప్రభుత్వం చేపట్టిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబుకు అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సలాం సాబ్, రామకృష్ణప్ప, రవి, సుబ్రి, పద్మనాభరెడ్డి, మంజునాథ్, శంకర్, గిరి పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎంవీఐ కార్యాలయ ఏర్పాటు పనులు

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం మంజూరైన విషయం విధితమే. ఈ కార్యాలయం ఏర్పాటు పనులు వేగం పుంజుకుంది. కొండచుట్టు మండపం సమీపం గల కేవీకే కాంప్లెక్స్ ప్రాంగణంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుండటంతో సంబంధిత కాంప్లెక్స్ ప్రాంగణాన్ని మున్సిపల్ సిబ్బంది సోమవారం జేసీబీ సాయంతో శుభ్రపరిచారు. త్వరలో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు కానుంది.

శశికి నివాళి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి శశి ఆదివారం తిరుపతిలో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. విద్యార్థి స్వగ్రామం వెదురుకుప్పం మండలంలోని వేణుగోపాలపురం గ్రామంలో సోమవారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మండలానికి చెందిన పలువురు నాయకులు లోకనాథరెడ్డి, మోహన్‌మురళి, రవి, జయచంద్ర, వరప్రసాద్, రాజగోపాల్, మురగయ్య, దొరబాబు నివాళులర్పించారు. అదేవిధంగా మండలంలోని దిగువపల్లాల పంచాయితీ ఆళ్లమడుగుకు చెందిన సాలమ్మ(72) అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పిటిసి సుకుమార్, సింగల్ విండో ఛైర్మన్ లోకనాథ్‌రెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

46 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం దళితవాడ సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో సోమవారం చెన్నైలోని ఎం.ఎస్ కంటి ఆసుపత్రి డాక్టర్లు నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు 46మందికి పరీక్షలు చేశారు. 11మందిని కంటి ఆపరేషన్ కోసం రెకమెండ్ చేసినట్లు డాక్టర్ అబ్బాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ జాన్ నవీన్, సర్పంచ్ బాబు, దేవేంద్రన్, జీవరత్నం పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్యలో సోమవారం అధికారులు రైతు సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు స్టాల్ ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ వాసు కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు దండాల రాధకృష్ణారెడ్డి రచించిన శ్రీమద్ భగ వద్గీత-తేతగీతుల తెలుగు సేత పుస్తకాన్ని సోమవారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆవిష్క రించారు. కార్యక్ర మంలో విశాఖపట్నంలోని శ్రీపాద డిగ్రీ కళాశాల అదినేత శనగల శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గణిత ఆచార్యులు తెలుగులో భాగవతంపై పుస్తకాన్ని రచించిన మేధావి అని కొనియాడారు. ప్రముఖ కవి గుమ్మడి జయరామిరెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ న్యాయ వాది రాగూరి నాగిరెడ్డి మాట్లాడుతూ అనువర్తిత గణిత ఆచార్యులు 50మందికి పైగా డాక్టరేట్లు అందిం చిన ఆచార్యులు భాగవతంపై పుస్తకం రచించడం గొప్ప పరిణామం అన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నంలోని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ వెంకటరమణ, భాస్కర్ రెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.

అక్రమ డీకేటీ పట్టాలు

రద్దు చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి -కేవిబి పురం: అక్రమ డికెటి పట్టాలు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు స్థానిక మండల తహశీల్దారు కార్యాలయం ఎదుట మోరేసి కండ్రిగ గ్రామస్తులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామం సమీపంలో సుమారు 10 ఎకరాల పశువుల మేత పురంబోకు భూమి వుందని ఆ భూమిలో గ్రామంలోని కొందరు రెండున్నర ఎకరాల్లో అక్రమంగా పట్టాలు చేసుకున్నారని విమర్శించారు. సిపిఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ ఆరే లెక్కలు దాఖలాలో సర్వే నెంబర్ 247/3 పిలో మేత పోరంబోకు భూమి10 ఎకరాలు ఉండేదని గత 15 సంవత్సరాలుగా ఈ భూమిని పశువుల మేతగా గ్రామస్తులు ఉపయో గించుకుంటా ఉండగా ఆ భూమిలో గ్రామంలోని కొందరు అక్రమంగా పట్టాలు చేసుకున్నారని విమర్శించారు. చెట్టు పుట్ట మీద ఉండగానే సాగులో ఉన్నట్టు అధికారులని తప్పుదోవ పట్టించి అక్రమంగా పట్టాలు చేసుకున్నారని విమర్శించారు. గత 15 సంవత్సరాల క్రితం కొందరు కబ్జా చేయాలని చూశారని, అప్పట్లో గ్రామస్తులు అడ్డుపడడంతో వదిలిపెట్టారన్నారు. అయితే ఇప్పుడు కొందరు రాజకీయ నాయకులు భూస్వాములు, అధికారులకు మామూళ్లు ఇచ్చి అక్రమంగా పట్టాలు పొందారని వాటిని వెంటనే రద్దు చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు, మోరస్ కండ్రిగ రైతులు వెంకటేశులు, రవి, శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుట్ట గొడుగుల పెంపకంలో అధిక లాభాలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: పుట్ట గొడుగుల పెంపకంలో అధిక లాభాలు సాధించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండలంలోని అన్నూరులో ఆర్‌బీకేలో రైతులకు వ్యవసాయ, ఇతర అనుబంద పంటలపై శిక్షణ కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో ఇతర అనుబంధ రంగాలైన ఉద్యావనం, సెరికల్చర్, పుట్టగొడుగుల పెంపకం పూల పెంపకం వంటి వాటిని సాగు చేస్తే మంచి దిగుబడులు సాదించవచ్చన్నారు. అలాగే వరి, వేరుశెనగ, చెరకు, నువ్వులు పంటల సాగులో మేలైన హైబ్రీడ్ రకాలు వాడకం వల్ల అధికం దిగుబడితో పాటు మంచి లాభాలు పొందవచ్చని సూచించారు. సాంకేతిక, నూతన ఒరవడులు, శాస్త్రీయ పద్ధతుల ద్వారా గ్రామాభివృద్ధి కొరకు అన్నూరు గ్రామాన్ని దత్తతకు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ క్రమంలో భాగంగా మహిళా రైతులకు పుట్టగొడుగుల పెంపకం. ఇతర వ్యవసాయ అనుబంద పరిజ్ఞానం అందించడం ద్వారా మహిళా రైతులు కూడా స్వయం సంవృద్ధి సాదించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాస్త్రవేత పద్మజ, ఉద్యానవన శాస్త్రవేత సీఎస్ సుధాకర్, అగ్రోనిమీ శాస్త్రవేత్త దివ్య, విస్తరణ శాస్తవేత రామకుమార్, మండల వ్యవసాయ అధికారిణి హేమలత, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాధరెడ్డి, రైతులు దామోదర్‌రెడ్డి, ఏఈవో హేమాద్రి, మునికృష్ణ పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

బహుమతి ప్రదానం చేస్తున్న ఏడీ

ప్రజాశక్తి-ఐరాల: 2022-2023 విద్యా సంవత్సరానికి గాను జిల్లా వ్యాప్తంగా జరిగిన ఇన్‌స్పైర్ మనక్ పోటీలలో పొలకల జెడ్పీ ఉన్నత పాఠశాల పదవ తరగతి చదివిన విద్యార్థి పి.తోరణ్ చౌదరి ప్రదర్శించిన ఎగ్జిబిట్ ఎంపికైంది. ప్రకృతిలో లభించే వనరులైన వేప, తులసి ఆకులు, మెంతులు, పసుపు, వట్టివేరు, పేపరు గుజ్జుతో రూపొందించిన ఆహార ధాన్యాలు ఎక్కువకాలం పాడవకుండా నిల్వ చేయుటకు ఉపయోగించే ఎగ్జిబిట్ ఆహార ధాన్యాల సంరక్షణ బ్యాగు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ వినూత్నమైన ఎగ్జిబిట్ రూపకల్పనలో పాల్గొన్న సైన్సు ఉపాధ్యాయులు పి.శంకర్ రెడ్డి, పి.నందకుమార్, ఎస్.మనోరమ కృషి అభినందనీయమని ఎంఈవోలు రుశేంద్రబాబు, దామోదర్‌నాయుడు, ప్రధానోపాధ్యాయురాలు ఎం.శాంతకుమారి తెలిపారు.ం

చిత్తూరుడెస్క్: రాష్ట్రస్థాయి ఇన్స్పైర్మనక్ పోటీలకు నగరి మున్సిపాలిటీ చింతలపబెడకు చెందిన సీజీ షారిని ఎంపికైంది. స్థానిక ఎస్పీ విద్యానికేతన్లో 8వ తరగతి చదువుతున్న వారిని తడి బట్టలలోని నీటిని పిండడానికి పరికరాన్ని తయారుచేసి చేపట్టిన ప్రయోగం రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్మనకు ఎంపికైంది. ఈ ప్రయోగాన్ని చేసిన విద్యార్థిని, గైడ్‌చర్గాగా కవితను హెడ్మాస్టర్ పెరుమాళ్ అభినందించారు.

'సమాజాభివృద్ధే ధ్యేయం'

సర్టిఫికెట్ పంపిణీ చేస్తున్న ఎన్‌వైకే కోఆర్డినేటర్

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సేవా సంస్థలు తమవంతు కీలక పాత్ర వహిస్తున్నాయని చిత్తూరు నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ ప్రదీప్ అన్నారు. మండలంలోని వేల్కూరులో క్రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ 30వ వార్షికోత్సవం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు భూపతి మాట్లాడుతూ 5వేలు కుటుంబాలకు బయోగ్యాస్ ప్లాంట్‌ని ఉచితంగా కట్టించి ఇచ్చామన్నారు. వెయ్యి కుటుంబాలకు జీవన ఉపాధుల మెరుగుదల కల్పించామని, 500కుటుంబాలకు మరుగుదొడ్లు ఉచితంగా నిర్మించి ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సిందియా, సుచి, త్రిబులెక్స్‌తో పాటు పలు సంస్థ ప్రతినిధులు, మండల ఐకెపీ ఏపీఎం చిరంజీవి, పలువురు పాల్గొన్నారు.

పరామర్శ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలోని ఆర్ఎంపీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి శుక్రవా రం రాత్రి రోడ్డు పచ్చికాపల్లం వద్ద ప్రమాద పాలై య్యారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో తిరు పతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్విమ్స్‌లో సోమవారం అతన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మునస్వామి, రాజా ఉన్నారు.

ధ్యానాభిరామస్వామిని దర్శించుకున్న జడ్పీ ఛైర్మన్

స్వామిని దర్శించేందుకు వెళ్తున్న జెడ్పీ ఛైర్మన్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: కంభంపల్లి పంచాయతీ పరిధిలోని దాసర్లపల్లి గ్రామ సమీపాన కార్వేటి కొండపై వెలసివున్న ధ్యానాభిరామస్వామి ముగిసిన బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక వైసీపీ పార్టీ కన్వీనర్ ఆహ్వానం మేరకు జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు సోమవారం దర్శించుకున్నారు. పురోహితులతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. వారితోపాటు ఎం.కొత్తూరు సర్పంచ్ చంద్రమౌళి, గడ్డురు సర్పంచ్ దేవేందర్ రెడ్డి, వైసీపీ కంభంపల్లి పంచాయతీ కన్వీనర్ బాలాజీ పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి నియామకం

ప్రజాశక్తి-కార్వేటినగరం: వైసీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శిగా కార్వేటినగరంకి చెందిన మురళీకృష్ణారెడ్డిని ఆ పార్టీ నియమించింది. ఈ మేరకు సోమవారం ఆయనకు ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, పురంధర్, గోపి, కుప్పయ్య, అమీద్, లోకనాధనాయుడు, మురగయ్య, మునికృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

మురళీకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు

● పలువురికి గాయాలు

ప్రమాదంలో పల్టీకొట్టిన ట్రాక్టర్, దెబ్బతిన్న బస్సు ముందుభాగం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ట్రాక్టర్‌ను బస్సు ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన సోమవారం మండలంలోని లూకాస్ పురం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. కేరళ నుండి ఒరిస్సాకు వెళ్తున్న బస్సు బంగారుపాళ్యం నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ని అధిగమించబోయి వెనుక భాగంలో ఢీకొంది. దీంతో బస్సులోని ప్రయాణికులు, ట్రాక్టర్ డ్రైవర్ గాయాలపాలైయ్యారు. ప్రమాదం చోటు చేసుకున్న కొంత సమయం రహదారిపై ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడింది. అక్కడికి చేరుకున్న పోలీసులు గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాదంలో కాలు కోల్పోయిన యువకుడు

ప్రజాశక్తి-కుప్పం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు కాలు పోగొట్టుకున్న ఘటన వెలుగుచూసింది. వెంటనే స్థానిక రైల్వే సిబ్బంది అప్రమత్తం కావడంతో యువకుడు ప్రాణాలతో బయట పడినట్లు అక్కడి పోలీసులు తెలిపారు. వైద్య చికిత్స నిమిత్తం క్షతగాత్రుని 108వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుండి చెన్నై వెళుతున్న రైలు నుండి యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. కాగా క్షతగాత్రుడు గుడుపల్లి మండలం కనమలపల్లి గ్రామానికి చెందిన సుందర్ సాత్విక్‌గా గుర్తించామన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

ప్రమాదంలో నుజ్జునుజ్జైన యువకుడి కాలు

అనుమానాస్పదంగా యువకుడి మృతి

యువకుడి మృతదేహం

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని రైల్వేగేట్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని యువకుడు రైల్వే ట్రాక్ వద్ద మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు సుమారు సోమవారం ఉదయం 9:30గంటల ప్రాంతంలో యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. ఈ యువకుడు శాంతిపురం మండలానికి చెందిన వ్యక్తిగా కొంతమంది భావిస్తున్నారని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో చేస్తున్నారు.

దాడుల నివారణకే ఏఐసిఎఫ్ ఏర్పాటు: పాల్ రాజ్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: క్రైస్తవులపై తరచూ జరుగుతున్న దాడులను నివారించేందుకే ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెలోషిప్(ఏఐసిఎఫ్)ను ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పాల్‌రాజ్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక గురునగర్ కాలనీలోని ఏఐసిఎఫ్ కార్యాలయంలో విలేకరులతో పాల్‌రాజ్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ మాట్లాడారు. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులపై దాడులు, అరాచకాలు పెరిగిపోతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకే ఏఐసిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డేనియల్ పొలిమెట్ల రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఏఐసిఎఫ్ కార్యవర్గాలను ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు.

బాలాయపల్లిలో బర్డ్‌ఫ్లూ భయం

ప్రజాశక్తి - బాలాయపల్లి: నెల్లూరు జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రబలిందని సోషల్ మీడియాలోనూ, పత్రికల్లోనూ పెద్దఎత్తున ప్రచారం జరగడంతో బాలాయపల్లిలో ఈ ప్రభావం కనిపించింది. నెల్లూరు జిల్లా కలెక్టర్ అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసి, గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ దండోరాలు వేస్తున్నారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకితే ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందని తెలియడంతో ప్రజలు ఆదివారం చికెన్ కొనుగోలు చేయడానికి వెనుకంజ వేశారు. నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలోని చాట్లగుట్ట, కోవూరు మండలంలోని గుమ్మళ్లదిబ్బ ప్రాంతాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాధితో కోళ్లు చనిపోయాయి. అయితే ఒకప్పుడు నెల్లూరు జిల్లాలో ఉండి ప్రస్తుతం తిరుపతి జిల్లాలో విలీనమైన మండలాల్లో భయం నెలకొంది. తిరుపతి జిల్లా అధికార యంత్రాంగం కనీసం అవగాహన కల్పించకపోవడం, అప్రమత్తం కాకపోవడం గమనార్హం. ఆదివారం బాలాయపల్లిలో చికెన్ అంగళ్లలో జనం కనిపించలేదు. మరికొన్నిచోట్ల కోళ్లు చనిపోవడంతో చికెన్ వ్యర్థాలు రోడ్డుపక్కన పెద్దఎత్తున కనిపించాయి. అవి బర్డ్‌ఫ్లూతో చనిపోయాయో, లేక ఇంకేదైనా వ్యాధి ప్రబలి చనిపోయాయో అధికారులు తేల్చాల్సి ఉంది.

స్విమ్స్‌లో సంక్లిష్ట ఆపరేషన్లు సక్సెస్

తిరుపతి సిటి : స్విమ్స్‌లో సంక్లిష్ట ఆపరేషన్లు సక్సెస్ అవుతున్నట్లు డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సచిన్‌కుమార్ ద్వివేది (21) వేదిక్ యూనివర్సిటీలో ఎంఎ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఫిబ్రవరి 6న వేదిక్ యూనివర్సిటీలో యాక్సిడెంట్ జరిగింది. స్విమ్స్ అత్యవసర విభాగంలో చేర్పించారు. నుదుటి వెనుక పుర్రె గట్టిగా దెబ్బతినడం వల్ల మెదడులోకి ఎముక చొచ్చుకుపోయింది. దవడ వెనుక ఎముకలు విరిగాయి. న్యూరోసర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ విభాగాల వైద్యులు నాలుగు గంటల పాటు నిర్విరామంగా శ్రమించి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశారు. పేషంట్ సచిన్ కుమార్ ద్వివేది మాట్లాడుతూ టిటిడి ప్రాణదానం పథకం ద్వారా తనకు ఆపరేషన్ చేశారని తెలిపారు. వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదా శివమూర్తి, రిజిస్ట్రార్ రాధా గోవింద త్రిపాఠి, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, నర్సింగ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.